సర్వేకు ప్రతి ఒక్క పౌరుడు సహకరించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్ • రాజన్న ఆలయంలో పూజలు

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ టౌన్, నవంబర్ 11: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రతి తెలంగాణ పౌరుడు సహకరించాలని ప్రభుత్వ పక్షాన విజ్ఞప్తి చేస్తున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కార్తీక సోమవారం సందర్భంగా వేములవాడ రాజన్నను తన కుటుంబ సభ్యులతోపాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అతిథి గృహంలో విలేఖరులతో మాట్లాడారు. సమగ్ర కుటుంబ సర్వే ఎవరి సమాచారాన్ని ఇబ్బంది పెట్టేందుకు కాదని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక అవసరాల కోసం తీసుకుంటున్న సమాచారమని చెప్పారు. కాగా, అంతకుముందు మంత్రిని అద్దాలమండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేయగా, ఈవో వినోద్‌రెడ్డి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు, వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నేడు వేములవాడకు మాజీ మంత్రి హరీశ్‌రావు

వేములవాడ టౌన్, నవంబర్ 11: కార్తీకమాసం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామివారిని మంగళవారం మాజీ మంత్రి హరీశ్ రావు దర్శించుకోనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఉదయం 11 గంటలకు ఆలయానికి చేరుకొని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారని తెలిపారు.

ఘనంగా జాతీయ విద్య దినోత్సవం

రుద్రంగి, నవంబర్ 11: జాతీయ విద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రుద్రంగిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్య ప్రాముఖ్యత అంశంపై సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హరినాథ్‌రాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ప్రభుత్వం తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్య దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. అనంతరం క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఇక్కడ కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్ పాల్గొన్నారు.

విన్నపాలు వినవలె

- ప్రజావాణికి సమస్యలు, వినతుల వెల్లువ
- 123 దరఖాస్తుల రాక
- అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, నవంబర్ 11: సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సహకారం కోసం ప్రజావాణికి ప్రజలు బాధితులు క్యూ కట్టారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియానికి తరలివచ్చి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా , అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌కు అర్జీలు అందజేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 45, రెవెన్యూ శాఖకు 34, సిరిసిల్ల మున్సిపల్ కు 5, ఉపాధి కల్పన శాఖ, జిల్లా సంక్షేమ అధికారి, సెస్ కార్యాలయం, తంగళ్లపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి నాలుగు చొప్పున, ముస్తాబాద్, గంభీరావుపేట ఎంపీడీఓ కార్యాలయం, వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం, డీఆర్డీవో, జిల్లా వైద్యాధికారి కార్యాలయానికి రెండు చొప్పున, కోనరావుపేట, వేములవాడ ఎంపీడీఓ కార్యాలయాలు, బీఎస్ఎన్ఎల్, డీపీఆర్ఓ, డీఎం ఆర్టీసీ సిరిసిల్ల, డీపీఓ, ఎక్సైజ్ శాఖ, ఎస్పీ ఆఫీస్, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్, డీసీఎస్ఓ, డీఎండబ్ల్యూఓకు ఒకటి చొప్పున దరఖాస్తులు రాగా, వెంటనే పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

గుడి వద్ద జీవనోపాధి కల్పించండి..

వేములవాడ రాజన్న ఆలయం వద్ద క్యారీ బ్యాగులు అమ్ముకునేందుకు అనుమతించాలని దివ్యాంగులు ముద్రంశెట్టి వినయ్‌కుమార్, గాజర్ల రవి ప్రజావాణిలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి వినతిపత్రం అందించారు. దివ్యాంగులమైన తమకు ఎటువంటి జీవనాధారం లేదని, గుడిలో లడ్డూలు అమ్మే కౌంటర్ వద్ద క్యారీబ్యాగులు అమ్ముకునేందుకు అనుమతించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులను చూడాలని కోరారు.

రేషన్‌కార్డు ఇప్పించాలని వినతి..

తీగల అంజయ్య

దివ్యాంగుల పెన్షన్, రేషన్ కార్డు మంజూరు చేయాలని ముస్తాబాద్ మండలం ఆవునూరుకు చెందిన దివ్యాంగుడు తీగల అంజయ్య కలెక్టర్‌ను కోరాడు. గౌడ వృత్తి చేసుకొని జీవించే తాను రెండేండ్ల క్రితం తాటిచెట్టు పై నుంచి పడడంతో వెన్నుపూసకు తీవ్రగాయమై మంచానికే పరిమితమైనట్లు చెప్పాడు. కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని, దివ్యాంగుల పెన్షన్‌తోపాటు రేషన్ కార్డు మంజూరు చేయాలని విన్నవించాడు.

దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని..

తనకు దివ్యాంగుల పెన్షన్ రావడం లేదని, బతకడమే కష్టమైపోతున్నదని గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన దివ్యాంగుడు పల్లె రాజం కలెక్టర్‌కు విన్నవించాడు. వినతి పత్రం అందజేశాడు.

స్కూటీ ఇప్పించాలని..

కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన దివ్యాంగురాలు పిట్టల బుజ్జమ్మ తనకు స్కూటీ ఇప్పించాలని కలెక్టర్‌ను కోరింది. తాను పుట్టుకతోనే దివ్యాంగురాలినని, నడవలేని స్థితిలో చాలా ఇబ్బందులు పడుతున్నానని తెలిపింది. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసింది.

ఇసుక తరలింపును ఆపాలి

తంగళ్లపల్లి మండలం తుర్కపల్లి వద్ద మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తుండడంతో పొలాల వద్ద బోర్లు ఎండిపోయి పంటకు నష్టం వాటిల్లుతుందని మండలానికి చెందిన రైతులు కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇసుక తరలించకుండా చూడాలని కే దేవయ్య, జే నాగరాజు, మరికొందరు రైతులు కలిసి విన్నవించారు.

దివ్యాంగురాలికి మాన్యువల్ ట్రై సైకిల్..

నడవలేక ఇబ్బంది పడుతున్న ఓ దివ్యాంగురాలి బాధను తెలుసుకున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తక్షణమే స్పందించి, మాన్యువల్ ట్రై సైకిల్ అందజేశారు. వేములవాడ పట్టణానికి చెందిన ముక్తికాంత సరోజన చాలా రోజులుగా నడవలేక ఇబ్బంది పడుతున్నది. సోమవారం ప్రజావాణికి వచ్చి తనకు మాన్యువల్ ట్రై సైకిల్ అందజేయాలని కలెక్టర్‌కు విన్నవించడంతో ఆయన వెంటనే స్పందించారు. మాన్యువల్ ట్రైసైకిల్ ఇవ్వాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించడంతో ఆయన వచ్చి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు దివ్యాంగురాలు కృతజ్ఞతలు తెలిపింది.

తప్పుడు ప్రచారం చేసిన ఆరుగురిపై కేసు

వేములవాడ, నవంబర్ 11: సామాజిక మాధ్యమాల వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎండీ యూసుఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు వేములవాడ పట్టణ పోలీసులు సోమవారం తెలిపారు. ఫొటోలతో కూడిన బ్రోచర్ తయారుచేసి తన పరువుకు భంగం కలిగించేలా సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేస్తున్నారని యూసుఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం ఎఫ్ఆర్ నంబర్ 605/2024 ద్వారా 296(బీ), 352 బీఎన్ఎస్, 67 ఐటీ యాక్ట్ సెక్షన్ల కింద ఆరుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.

కోరుట్ల టూ ఎల్లారెడ్డిపేట బస్సు ప్రారంభం

వీర్నపల్లి/రుద్రంగి నవంబర్ 11: కోరుట్ల నుంచి ఎల్లారెడ్డిపేట వరకు ఆర్టీసీ బస్సు సోమవారం మళ్లీ ప్రారంభమైంది. గతంలో ఈ రూట్‌లో నడిచిన బస్సు వివిధ కారణాలతో రద్దు అయింది. ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ స్పందించి కోరుట్ల నుంచి మానాల మీదుగా ఎల్లారెడ్డిపేటకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉందని నాయకులు పేర్కొన్నారు. కాగా, ఈ బస్సు కోరుట్ల నుంచి రుద్రంగి, మానాల, మరిమడ్ల, వీర్నపల్లి మీదుగా ఎల్లారెడ్డిపేటకు ప్రతి రోజూ రెండు ట్రిప్పుల చొప్పున నడుస్తుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

వేములవాడలో హెయిర్ కటింగ్ షాప్‌లు బంద్

వేములవాడ, నవంబర్ 11: వేములవాడ పట్టణంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు హెయిర్ కటింగ్ షాప్‌లను మూసివేస్తున్నట్లు నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గడ్డం నవీన్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో కార్పొరేట్ స్థాయిలో కటింగ్ షాప్‌తో స్థానికంగా ఉండే నాయీబ్రాహ్మణుల ఉపాధి దెబ్బతింటుందని వాపోయారు. ఈ క్రమంలో షాప్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ బంద్ చేపట్టినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కటింగ్ షాప్‌ల ముందు బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను అతికించారు. ఇక్కడ నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు సారంపల్లి సంతోష్, ఇన్నారం రమేశ్, గంగిపల్లి చిరంజీవి, అమృతాఅనిల్, వెలిచాల శ్రీకాంత్, భూమేష్, గడ్డం తిరుపతి, లక్ష్మన్, నర్సింహులు, శ్రీనివాస్, రవి, మహేశ్, రాజు, శ్రీధర్, సుదర్శన్, భూమేష్ పాల్గొన్నారు.

కేటగిరీల వారీగా వేతనాలు అందించాలి

సిరిసిల్ల రూరల్, నవంబర్ 11: పల్లెల పరిశుభ్రతకు పాటుపడే పారిశుధ్య కార్మికులకు కేటగిరీల వారీగా వేతనాలను అందించాలని పారిశుధ్య కార్మికుల వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ పారిశుధ్య కార్మికులతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పదకొండవ పీఆర్సీ ప్రకటించిన విధంగా, జీవో నంబర్ 60 ప్రకారంగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 51ని సవరించి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని, లేదంటే ఈ నెల 20 నుంచి 25 దాకా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరవధిక సమ్మెకు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లింగంపల్లి స్రవంతి, రాజు, రమేశ్ కార్మికులు ఉన్నారు.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

సిరిసిల్ల రూరల్, నవంబర్ 11: అక్రమంగా నిల్వ చేసిన 12 క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు రామన్నపల్లెలో గంగెద్దుల మల్లయ్య గుడిసెలో సోదాలు చేయగా, అక్రమంగా నిల్వ ఉంచిన 12 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను గుర్తించామని, స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినా, రవాణా చేసినా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోదాలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ప్రశాంత్, రామ్మోహన్ ఉన్నారు.

విధులకు ఆటంకం.. ఒకరి రిమాండ్

కోనరావుపేట, నవంబర్ 11: కరెంట్ బిల్లు కొట్టే అసిస్టెంట్ హెల్పర్ విధులకు ఆటంకం కలిగించిన ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కమ్మరిపేట తండాకు చెందిన ఇస్లావత్ రమేశ్ తన ఇంటి కరెంటు బిల్లు నెలనెలా చెల్లించకపోవడంతో పెండింగ్ ఉండిపోయింది. సెస్ అధికారులు అక్కడికి చేరుకుని కరెంటు బిల్లు చెల్లించాలని పలుమార్లు సూచించినా పట్టించుకోలేదు. అయితే సోమవారం సెస్ సిబ్బంది కనెక్షన్‌ను తొలగించారు. గ్రామంలో కరెంట్ బిల్లులు కొట్టి, గొల్లపల్లికి వెళ్లారు. అయితే కనెక్షన్ తొలగించారని తెలుసుకున్న రమేశ్ గొల్లపల్లిలో బిల్లులు కొడుతున్న అసిస్టెంట్ హెల్పర్ దాసరి సురేష్ దగ్గరికి వెళ్లి దురుసుగా ప్రవర్తించాడు. కరెంటు బిల్లు మిషన్‌ను పగులగొట్టాడు. సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ దర్యాప్తు చేశారు. విధులకు ఆటంకం కలిగించిన రమేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వడ్డీ వ్యాపారిపై కేసు

కోనరావుపేట, నవంబర్ 11: అక్రమంగా వడ్డీ వ్యాపారం చేస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో అక్రమంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న పలువురి ఇండ్లలో పోలీసులు సోదాలు చేశారు. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన దొంతుల శ్రీరాములు ఇంట్లో వడ్డీకి సంబంధించిన మూడు ప్రామిసరీ నోట్లు లభించడంతో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సామాన్య ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీకి డబ్బులు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులతో చట్టపరమైన పద్ధతులతో ఫైనాన్స్ నిర్వహించే వారినే ప్రజలు నమ్మాలని, గ్రామాల్లో ఎవరైనా అధిక వడ్డీ వసూలు చేస్తే వారి వివరాలు పోలీసులకు అందించాలని సూచించారు.

బిల్డింగ్ నిర్మాణం వివాదాస్పదం

సిరిసిల్ల టౌన్, నవంబర్ 11: సిరిసిల్ల పట్టణంలోని పెద్ద బజార్ ప్రాంతంలో ఓ బిల్డింగ్ నిర్మాణం వివాదాస్పదమైంది. స్థానిక పెద్ద బజార్‌లో ఓ వ్యాపారికి చెందిన బిల్డింగ్ నిర్మాణాన్ని సోమవారం మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. అక్కడే ఉన్న బిల్డింగ్ యాజమాని కొడుకు భవనం రెండో అంతస్తుపైకి ఎక్కి ఆందోళనకు దిగాడు. తమ ఇంటి నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నాయని, మున్సిపల్ అధికారులు కావాలనే తమ ఇంటిని కూల్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించాడు. ఈ విషయంపై టౌన్ ప్లానింగ్ అధికారిని వివరణ కోరగా, మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భాగాన్ని తొలగించాలని సూచించినట్లు చెప్పారు. కోర్టు ఆదేశాల ప్రకారమే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మూడ్రోజులపాటు అభిషేక పూజలు లేవు

వేములవాడ టౌన్, నవంబర్ 11: కార్తీకమాసం సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఈ నెల 13 నుంచి 15 దాకా ఆలయ గర్భగుడిలో అభిషేక పూజలు, అన్నపూజలను నిలిపివేసినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. 13న రేవతి నక్షత్రం, 14న వైకుంఠ చతుర్థశి, 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని, రద్దీ ఎక్కువగా ఉండే అవకాశాలతో అభిషేక పూజలు నిలిపివేశామని, భక్తులు సహకరించాలని సూచించారు. తిరిగి 16న శనివారం అభిషేకపూజలు నిర్వహించుకోవచ్చునని తెలిపారు.

రాజన్న ఆలయంలో కోడె టిక్కెట్ల బ్లాక్ దందా

కోడె టికెట్లను బ్లాక్‌లో అమ్ముతున్న వ్యక్తులు

- ఇద్దరిని పట్టుకున్న ఎస్పీఎఫ్ సిబ్బంది

వేములవాడ టౌన్, నవంబర్ 11: రాజన్న ఆలయ పరిసరాల్లో కోడె టిక్కెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్న ఇద్దరిని ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. కార్తీక సోమవారం సందర్భంగా రాజన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. కోడె టిక్కెట్ల కోసం దాదాపు 3 నుంచి 4 గంటలు వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. ఇదే అవకాశంగా తీసుకున్న ఇద్దరు వ్యక్తులు ఆలయ పరిసరాల్లో బ్లాక్‌లో కోడె టిక్కెట్లు విక్రయిస్తుండగా, ఎస్పీఎఫ్ సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టణ పోలీసులకు అప్పగించినట్లు ఎస్పీఎఫ్ ఏఎస్ఐ కరణ్‌సింగ్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఇల్లంతకుంట, నవంబర్ 11: అప్పుల బాధతో పత్తికుంటపల్లికి చెందిన రైతు బోడ రాజిరెడ్డి (41) సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజిరెడ్డి నూతనంగా ఇంటి నిర్మాణం చేయగా, అప్పులు పెరిగాయి. నెలవారీగా ఆనుకున్నంత ఆదాయం రాకపోవడంతో మనస్తాపం చెందాడు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజిరెడ్డికి భార్య మంజుల, కొడుకు, కూతురు ఉంది. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

ఒంటరి జీవితం భరించలేక..

తెలంగాణ చౌక్, నవంబర్ 11: ఒంటరితనం, ఆపై అనారోగ్యాన్ని భరించలేక సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన పల్లె ఆంజనేయులు(50) కార్గిల్ లేక్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఆంజనేయులు కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఏడాది క్రితం భార్య అనారోగ్యంతో మృతి చెందింది. సంతానం లేకపోవడంతో తల్లి లక్ష్మీ దగ్గర ఉంటున్నాడు. అయితే కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. కార్గిల్‌లేక్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆంజనేయులు తమ్ముడు సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

విద్యుదాఘాతంతో గిరిజన రైతు మృతి

వీర్నపల్లి, నవంబర్ 11: వ్యవసాయ మోటర్ స్టార్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి విద్యుదఘాతంతో గిరిజన రైతు మృతిచెందిన ఘటన వన్‌పల్లి పరిధి కేలోత్‌తండాలో జరిగింది. ఎస్ఐ ఎల్లాగౌడ్ కథనం ప్రకారం.. తండాకు చెందిన అజ్మీరా రెడ్డి(57) ఆదివారం రాత్రి పొలం వద్ద మోటర్ ఆఫ్ చేసేందుకు వెళ్లాడు. అయితే స్టార్టర్‌కు తేలి ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అజ్మీరారెడ్డి సోదరుడు మంగ్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..

గంభీరావుపేట, నవంబర్ 11: సముద్రలింగాపూర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ శివకుమార్ తెలిపారు. సముద్రలింగాపూర్ వద్ద ప్రధాన రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న సదరు వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. సిరిసిల్ల దవాఖానకు తరలించి, చికిత్స అందిస్తుండగా, సోమవారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వివరించారు. మృతుడికి సుమారు 35 ఏండ్ల వయస్సు ఉంటుందని, ఎవరికైనా వివరాలు తెలిస్తే గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆలయంలో చోరీ

ముస్తాబాద్, నవంబర్ 11: మద్దికుంట శివారులోని శివాలయంలో హుండీని ఆదివారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. సోమవారం ఉదయం నిత్య పూజల కోసం అర్చకులు ఆలయానికి వెళ్లగా, హుండీ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

పాఠశాలకు ఆట వస్తువుల బహూకరణ

ఇల్లంతకుంట, నవంబర్ 11: గాలిపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 1989-90 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు రూ.10 వేల విలువైన ఆట వస్తువులను హెచ్‌ఎం మేకల పావనికి సోమవారం అందజేశారు. వాలీబాల్, నెట్, పోల్స్ అందజేయగా, పూర్వ విద్యార్థులను టీచర్లు అభినందించారు.

పోత్గల్‌లో కళాప్రదర్శనలు

ముస్తాబాద్, నవంబర్ 11: పోత్గల్ గ్రామంలో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారథి ఎడ్మల శ్రీధర్‌రెడ్డి సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేపై కళా ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే సందర్భంగా ఇంటికి వచ్చే ప్రభుత్వ అధికారులకు గ్రామ ప్రజలందరూ సహకరించాలని, కుటుంబ వివరాలు తప్పులు లేకుండా చెప్పాలని, నిజమైన సమాచారాన్ని అందించాలన్నారు. అలాగే గ్రామప్రజలకు అర్థమయ్యేలా పాటల రూపంలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఇక్కడ కళాకారులు శ్రీరాముల రామచంద్రం, గడ్డం శ్రీనివాస్, గుగ్గిల్ల పర్శరాములు, వంతడ్పుల గణేశ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
సంపాదించుకోవచ్చు
★మీ ఇంటి వద్ద ఉండి రోజుకు 2 గం|| చేతివ్రాత ద్వారా నెలకు 10 వే||ల నుండి 15 వే||ల వరకు సంపాదించుకోవచ్చు. పూర్తి వివరములకు కాల్ చేయండి. సెల్: 6304484084.
NTK-325693
NAME CHANGE
★I, Ramaswami Lakshman S/o Lakshman, R/o. Chinthakunta, Mdl. Kothapally, I have changed my Name As Kalakuntla Ramaswami S/o. Laxman. for all purposes. Cell: 79953 04168.
NTK-0000
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

పోరాటయోధురాలు రంగవల్లి

- ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ • నాంపల్లిలో విజ్ఞాన కేంద్రం ప్రారంభం

విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, నవంబర్ 11: నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా ఉద్యమించిన వీరవనిత, పోరాటయోధురాలు రంగవల్లి అని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి నందికమాన్ వద్ద రంగవల్లి విజ్ఞాన కేంద్రాన్ని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్కతో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. రంగవల్లి జ్ఞాపకార్థం విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషకరమన్నారు. రంగవల్లి నిజాం కాలం నుంచే నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. రంగవల్లి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె జ్ఞాపకార్థం విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసిన అరుణోదయ సాంస్కృతి సమాఖ్య అధ్యక్షురాలు విమలక్కతో పాటు పలువురని ఆయన అభినందించారు. అనంతరం ఆటపాటలతో కళాకారులు అలరించారు. కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ కాసీం, భగవంతరెడ్డి, లక్ష్మీదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, వివిధ సంఘాల నాయకులు, రచయితలు పాల్గొన్నారు. అలాగే వేములవాడ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మౌలానా అబుల్ కలామ్ అజాద్ జయంతి, మైనార్టీ వెల్ఫేర్ డే కార్యక్రమంలో ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీచర్ల బదిలీ ఉత్తర్వులు జారీ చేయాలి

కటకం రమేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీచర్లు

వేములవాడ రూరల్, నవంబర్ 11: 317 జీవో బాధిత ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి త్రిసభ్య కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించి 15 రోజులైనా ఇప్పటి వరకు ఉత్తర్వులు రాలేదని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ పేర్కొన్నారు. సోమవారం రుద్రవరం పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. 317 జీవో పై త్రిసభ్య కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి 15 రోజులు దాటిందని, ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటించలేదన్నారు. నివేదిక వచ్చాక న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు న్యాయం చేయలేదన్నారు. వివిధ పాఠశాలల్లో సర్‌ప్లస్ ఉపాధ్యాయులను నిబంధనల మేరకు సమీప పాఠశాలల్లో తాత్కాలికంగా సర్దుబాటు చేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వులు జిల్లా విద్యాశాఖ అమలు చేయకపోవడం సరికాదన్నారు. స్థానికంగా ఉపాధ్యాయులు ఉండాలన్న నిబంధనకు టీఆర్‌టీఎఫ్ వ్యతిరేకం కాదని, అయితే సర్దుబాటులో నిబంధనలు పాటించకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు. 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం, ఈ కుబేర్‌లోని పెండింగ్ బిల్లుల సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కటకం రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ ఉన్నారు.

టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ

తెలంగాణ చౌక్, నవంబర్ 11: సదిశ ఫౌండేషన్ మాథ్స్ టాలెంట్ టెస్టులో నెహ్రూనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు హెచ్‌ఎం భాగ్యరేఖ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ ఉపాధ్యాయుల శ్రీనివాస్ రావు, కీర్తి, రాజశేఖర్ తదితరలు ఉన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు...

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 11: మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేద పండితుల ఆధ్వర్యంలో భగవదారాధన, దివ్య ప్రభంధ సేవాకాలము శాత్తుమురై నివేదన కార్యక్రమాలు ఘనంగా జరిపారు. ఇక్కడ ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్ చైర్మన్ గంట వెంకటేశ్‌గౌడ్, వేదపండితులు బీటుకూరి నవీన్‌చారి ఉన్నారు.

రాజన్నకు పోటెత్తిన భక్తజనం

కార్తీక సోమవారం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శివనామస్మరణతో మార్మోగింది. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు, ఉదయాన్నే ధర్మగుండంలో స్నానం చేసి తలనీలాలు సమర్పించుకున్నారు. కోడెమొక్కు తీర్చుకొని స్వామివారి దర్శనానికి బారులు తీరారు. కాగా, రాజన్నను 75 వేల మంది దర్శించుకున్నారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా ఆలయానికి రూ.32 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. కాగా, ఆలయంలో రాత్రి ఆలయ ప్రధానార్చకులు నమిలికొండ ఉమేశ్ ఆధ్వర్యంలో అర్చకులు మహాలింగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. - వేములవాడ టౌన్, నవంబర్ 11